స్కెచ్

# త్యాగ చిహ్నం

"రత్నం"

మళ్ళా మళ్ళా చదువుకొన్నాడు ధర్మయ్య. అప్పుడే టపాలో వచ్చిన ఆ టైపు కాగితాన్ని. నెరిసిన అతని తలలో ఒక్కసారి మెఱుపులు మెఱిసినయ్. నీరసించిన అతని ముసలి గుండె ఆవేగంతో దడదడ లాడింది. 'ఇన్నాళ్ళకు తన ఆశ ఫలించింది....' ఊహా స్వప్నం నిజమయింది! ఎంత ఆందోళన ...ఎన్ని రికమెండేషన్లు....

రాజకీయ బాధితుడిగా గుర్తించిన ప్రజాప్రభుత్వం, అతని త్యాగానికి విలువగట్టి....ప్రతిఫలంగా అయిదెకరాల బంజరు శాంక్షన్ చేసింది. ఆ సువార్త భార్యకు చెప్పేదాకా ఆగలేక పోయాడు ధర్మయ్య. అయిదెకరాలు....! అయిదెకరాలంటే మాటలా యీ కరువు రోజుల్లో! నెట్టుకొచ్చిన ఆ సిరి సంగతి విని ఉబ్బి తబ్బిబ్బయింది శాంతమ్మ. ఆశ్చర్యంతో తెరిచిన ఆవిడ బోసినోరు ఓ క్షణం అలానే ఉండిపోయింది. కొడిగట్టి మసక బారిన దీపంలో....చమురుపోసి మసి తుడిచి నట్టయింది ఆమె పని మొక్కు చెల్లించుకోటానికి వెంటనే పుట్టలమ్మ గుడికి బయల్దేరింది. శాంతమ్మకు దేవుడి ఆర్తత్రాణ పరాయణత మీద పరమ విశ్వాసం. అంజనేయ దండకం ఆవిడ నిత్య పారాయణ గ్రంథం జీవితంలో ఎన్ని ఆపద మ్రొక్కులు మొక్కుకుందో....తీర్చుకొందో లెఖ్ఖేలేదు

భర్త జైల్లోపడి విడుదల కాగానే వెంకటేశ్వరుడికి నిలువు దోపిడి యిచ్చింది కొడుకు పరీక్ష తెలియగానే శివుడికి అభిషేకం చేయించింది. కాపరానికి వచ్చింది మొదలు ప్రతి సమస్యకూ మొక్కుకొందే ఆవిడకు మనోబలం కుదరేదికాదు ఆఖరికి పుత్రుడి ఉద్యోగం కోసం....సంసారం గడపటం కోసం ఆ దేవతల మీదే భారంవేసి కొబ్బరి ముక్కల ఉపహారాల్ని చెల్లించుకొంటూనే ఉంది. అయిదెకరాలు వచ్చిందని తెలియగానే ఇక ఆవిడెట్లా ఊరుకొంటుంది! అంతా ఆ పుట్టలమ్మ దయ! అందుకనే హుటాహుటి బయల్దేరింది శాంతమ్మ, కొబ్బరికాయ కొట్టి రావటానికి!

ధర్మయ్యకు భార్య తీర్చే మొక్కులమీదా, ఆవిడ ఆరాధ్య దైవాలమీదా ఏమంత నమ్మకం లేదు వెనకటి కాలపుదని ఉపేక్ష వహిస్తూ ఇంతకాలం దివ్యంగా కాపరం చేశాడు. ఇవ్వాళా గుళ్లోకి పరుగెత్తుతోంటే చూస్తూ ఆవిడ చాదస్తానికి తనలో తానే నవ్వుకొన్నాడు.

* * *

చుట్ట ముట్టించి మడత కుర్చీలో నడ్డి వాల్చిన ధర్మయ్యలో....ఆ పొగతోపాటు సుళ్లు తిరుగుతూ రకరకాల ఆలోచనలు ముసురుకొన్నయ్. ఎంత తృప్తి పడదామన్నా హృదయంలో ఏదో ఆవేదన అశాంతిని రేపుతూనే ఉంది ఒక్క నిట్టూర్పు విడిచాడు ధర్మయ్య, నిస్సహాయతకు చిహ్నంగా. ఆ వేడిగాలి పైకి పోతున్న చుట్ట పొగను గవాక్షంలోకి తరిమింది.

అప్రయత్నంగా అతని కళ్ళు ఎదురుగా గోడమీద తగిలించిన ఫోటోవైపు తిరిగినయ్ 'ఆ ఒక్కగానొక్క కొడుకు కోసం ఇన్ని తిప్పలు పడుతోంటే తానంటే వాడికి లెఖ్ఖేలేదు. అడుగడుగునా ఎదిరించాడు తన పెద్దరికాన్ని. మంత్రి దగ్గర రికమండేషన్ తెచ్చి ఉద్యోగం చూపిస్తే దానికి రాజీనామాపెట్టేడు. ఏదో పత్రికలోచేరి తమకు అయిదెకరాలిచ్చి బ్రతుకు నిల్పిన ప్రభుత్వంమీదే ఢామాడా రాస్తున్నాడు స్వతంత్ర భారతదేశంలో వాడికి స్వాతంత్ర్యం కావాలిట! కట్నాలూ కానుకలూ అఖ్ఖర్లేదుట! సంప్రదాయాలకూ ఆచారాలకూ గుండుసున్నా చుట్టాలిట! కన్నవాళ్ళని కాదని....తాము చూడనక్కర లేకుండానే

ఎవరో - కిరస్తానీదాన్ని రిజిస్టరుపెళ్ళి చేసుకొన్నాడు తనబాధ్యత తీరినట్టు.. . ఉత్తరాలు మాత్రం రాస్తాడు, ఆశయాలు ఏకరువు పెడుతూ! మాట్లాడితే నైతికవిలువల్ని సవాల్ చేస్తూ సవాలక్ష ప్రశ్నలు కురిపిస్తాడు!

అహంకారం దెబ్బతిన్న ధర్మయ్యలో ఆవహనం అంతిమస్థాయికి చేరుకొంది. ఆ ఆలోచనల్లో చేతిలోచుట్ట చేతిలోనే ఆరిపోయింది. సలసలకాగే రక్తం ఆ చుట్టతోపాటు చల్లారిపోయింది ప్రతి స ఘటనకూ అగ్గియిపోవటమూ... అంతలోనే చల్లారటమూ మామూలే ధర్మయ్యకు కొడుకుమీద క్రోధం ఎంతలో ఉప్పొంగేదో వాడి కీర్తి గుర్తుకువచ్చి అంతలోనే మమకారంకూడా పొడుచుకు వచ్చేది

అసలి పయనుచెల్లినవాళ్ళ అలవాటే అది లోకం ముందుకుపోతున్నకొద్దీ వెనకతరం వాళ్ళకి ఊగిసలాట తప్పదు ధర్మయ్యకూడా తల్లిదండ్రులకు ఎంతో బాధాకరంగా ప్రవర్తించాడు. ఏడుస్తున్న ఆ ముసలివాళ్ళని లక్ష్యం చేయకుండానే సత్యాగ్రహంచేసి జైలుకెళ్లేడు లాఠీదెబ్బలు తిన్నాడు ..ఉన్న నాలుగెకరాల కొంద్రా దేశభక్తి కార్యక్రమంలో ఊడగొట్టేడు కొడుకు ఎక్కువచ్చి వ్యక్తిత్వం చూపుతోంటే ఆచరణలో అభివృద్ధి శోధిస్తుంటే ఆ ధర్మయ్యే సహించి ప్రోత్సహించలేక పోతున్నాడు కొత్త నీళ్ళువచ్చి పసరుబట్టిన నిలవనీటిని కొట్టివేస్తుంటే వచ్చే బాధే యిది!

భార్యరాకతో ధర్మయ్యలో ఆలోచనల గొలుసు తెగింది. బెల్లమూ కొబ్బరిముక్కల ప్రసాదం చేతిలో బెట్టగానే పరాకుగా నోట్లోవేసుకొన్నాడు. కళ్ళు కద్దుకోనందుకు గునుసుకొంటూ పాపపరిహారార్థం తనే లెంపలు వేసుకొన్నది శాంతమ్మ ధర్మయ్య ముఖంలో పరిహాసం తాండవించింది భార్యను అట్లా ఉడికించటమంటే తగని హుషారు అతనికి. కాని తనదోవకు అర్ధాంగిని తిప్పుకోటానికి ఈ సలభై ఏళ్ళ కాపరంలో ధర్మయ్య వశంగాలేదు.

నిజంగా భార్యా....తనూ....కొడుకూ తమ తమ తరాలకు వారసులమనీ....ముందడుగు తప్పనిసరి అని ధర్మయ్యకు తెలిస్తే ఎంత బాగుండును! కొడుకుతోపాటు పరుగెత్తే జవసత్వాలు ధర్మయ్యలో లేవు. అందుకే ఆ ఉక్రోషం!....అంత ఆవేదన!

ధర్మయ్యకు తన జీవితం గుర్తుకు వచ్చి అదో సంతృప్తి కలిగింది. ఆ దశావతారాల మధ్య బుద్ధుడు....గాంధీ ప్రక్కనే నెహ్రూ, టోపీతో జెండా పట్టుకొని నిల్చున్న తాను, అన్నిటికంటె క్రిందుగా తన కొడుకు! కళ్ళు మూసుకొని మనసులోకి చూచుకొని పులకించిపోయాడు గర్వంతో ధర్మయ్య శాంతమ్మ దేవుళ్ల బొమ్మలు తిరుణాలనుంచి తెచ్చి తగిలిస్తుంటే తాను కాదనలేకపోయాడు. ప్రక్కనే దేశనాయకుల ఫోటోలు వరుస దీరుస్తుంటే శాంతమ్మ సాయంకూడా చేసింది ధర్మయ్యకు పడకటింట్లో ఉన్న ధర్మయ్య ఫోటోను తనంతట తానే తెచ్చి వాటిప్రక్కన తగిలించింది కూడా కొడుకు బొమ్మను ఇద్దరూ కలిసి దేవుడిగూటి కెదుర్గుగ్గా శాంతమ్మ నిర్ణయించిన స్థలంలో ప్రతిష్ఠించుకొన్నారు వాడిమీదే తన కోపం!ప్రక్కకుఒత్తిగిలిన ధర్మయ్యకు కుర్చీకొమ్ము తగిలి గూడు కలుక్కుమన్నది లాఠీదెబ్బ. అతని త్యాగానికి చిహ్నంగా మిగిలింది అదే! ఆరోజు ఇంకా గుర్తులోనే ఉంది. తలిదండ్రులూ కంటికీ మంటికీ ఏడుస్తూ కాళ్లకడ్డంపడ్డారు... సత్యాగ్రహాలు వద్దని! పెట్టెలో విదేశీ వస్త్రాలు తీసి ఆవేశంకొద్దీ భోగిమంట వేశాడు. జండా పట్టుకొని, లాఠీలు విరుచుకుపడుతున్నకొద్దీ మేరువులా నిల్చాడు. సత్యాగ్రహంచేసి జైల్లో పడి నలిగిపోయాడు. పూర్వస్మృతులు గుర్తుకొచ్చినకొద్దీ అతనిలో ప్రతి అణువూ తన్మయతలో మునిగిపోయింది

శాంతమ్మ దేవుడిగూట్లో ప్రమిద వెలిగించి ఆ వెలుగులో మెరుస్తున్న భర్త కన్నీటిని చూసి అదిరిపడింది! అవి ఆనంద బాష్పాలని.... అమృతానుభవసారాలని తెలీదు ఆ పిచ్చితల్లికి! భార్య కదిలించగానే కళ్లు తెరిచాడు ధర్మయ్య. ఎదురుగ్గా దేవుడిగూట్లో ప్రమిద కాంతి ప్రసరిస్తూ దేదీప్యమానంగా వెలిగిపోతున్న తన త్యాగానికి వారసుడు....తన రక్త సంబంధం కన్పించి మురిసిపోయాడు ఆ వృద్ధుడు! ★